క్లుప్తంగా

తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

రాజేంద్రనగర్: తెలంగాణ ఐకేపీ,వీవోఏలను ఉద్యోగులుగా గుర్తించి వారిని రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ రాజేంద్రనగర్ మండల కన్వీనింగ్ సభ్యులు బచ్చలకూర స్వామి కోరారు. ఈ మేరకు శనివారం రాజేంద్రనగర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అనిత, అలీమాబేగం, కప్పేట రాజు, చంద్రశేఖర్, ఈ.స్వామి, రంగస్వామి, జుట్కూరు మన్యం, రాజుకుమార్, శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏజీ వర్సిటీలో ఈద్ మిలాప్



ఏజీ వర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శనివారం ముస్లిం ఉద్యోగులు ఈద్ మిలాప్‌ను ఘనంగా నిర్వహించారు.ఉద్యోగులందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వర్సిటీ రిజిస్ట్రార్ సుదీర్‌కుమార్ మాట్లాడుతూ పండుగలన్నింటిని కలిసికట్టుగా నిర్వహించుకోవడం శుభసూచకమన్నారు. కార్యక్రమంలో వర్సిటీ అధికారులు ,బోధన, బోధనేతర కాంట్రాక్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

డీసీపీకి ఫిర్యాదు

శంషాబాద్ రూరల్: పోలీసుల ఏకపక్ష వైఖరితో తనకు అన్యాయం జరుగుతుందని బాధితుడు శనివారం డీసీపీకి ఫిర్యాదు చేశారు. శంకరాపురం గ్రామానికి చెందిన సూరిబాబు, చంద్రబాబు, సుధాకర్‌లు అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నట్లు స్థానికుడు చెన్నకేశి జైహింద్ గతంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని వారు జైహింద్‌తో గొడవకు దిగి గాయపర్చారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేయగా.. కేవలం జైహింద్ కేసుకు సంబంధించి చార్జ్‌షీటు వేసి ఇబ్బంది పెడుతున్నట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి నిందితులతో కుమ్మక్కై వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె



శంషాబాద్ రూరల్: జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో మండల పరిషత్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం రెండోరోజుకు చేరింది. సీఎం నుంచి స్పష్టమైన హామీ వచ్చేంత వరకు సమ్మె కొనసాగుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు పి.భాస్కర్, డివిజన్ అధ్యక్షుడు భాస్కర్, ట్రెజరర్ శ్రీకాంత్, సెక్రటరీ సురేందర్, పంచాయతీ కార్యదర్శులు రాధిక, రమ్య, ప్రదీప్, రవికాంత్, యాదయ్య, రాజకుమారి, సౌజన్య, కన్యాకుమారి, షమీమ్, సమత, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి

శంషాబాద్: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ సమీపంలో రోడ్డు దాటుతున్న (50) మహిళను ఓ వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన ఆమెను ఉస్మానియా ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతిచెందింది.ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీధి కుక్క దాడిలో నలుగురికి గాయాలు

శంషాబాద్: వీధి కుక్క దాడిలో నలుగురు గాయపడ్డ సంఘటన శంషాబాద్ పట్టణంలోని మధురానగర్ కాలనీలో చోటు చేసుకుంది. శనివారం ఉదయం మధురానగర్ కాలనీలో 9వ వీధిలో ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారి (7)పై కుక్క దాడి చేయగా స్థానికులు అడ్డుకుని తరిమేశారు. తదనంతరం మరో ముగ్గురు ఇదే కుక్కదాడిలో గాయపడ్డారు. దీంతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. తీవ్రంగా గాయపడిన చిన్నారికి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించి నారాయణగూడ ఆస్పత్రికి తీసుకెళ్లాల్సిందిగా సూచించారు. వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుక్క నలుగురిని కరిచిన విషయం చెప్పినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు.

హైదర్షాకోట్‌కు పీఎంశ్రీ..



ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

- ప్రభుత్వ పాఠశాలకు ఏడాదికి రూ.40 లక్షల చొప్పున.. 5 సంవత్సరాల పాటు 2కోట్లు

బండ్లగూడ: జాతీయ విద్యా విధానం –2020 అమలు ప్రక్రియలో భాగంగా ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకానికి గండిపేట మండలం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి హైదర్షాకోట్‌లోని మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎంపికైంది.

ఏడాదికి రూ.40 లక్షల నిధులు..

ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలలను ఆధునిక సౌకర్యాలతో పాటు మోడల్ పాఠశాలగా మార్చడానికి ఈ నిధులను ఉపయోగిస్తారు. మౌలిక వసతులు, సాంకేతిక సాధనాలను సమకూర్చుకోవచ్చు. ఏడాదికి రూ.40 లక్షల చొప్పున 5 సంవత్సరాల పాటు 2కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం నేరుగా అందజేస్తుందని పాఠశాల ఉపాధ్యాయ బృందం తెలిపింది.

జిల్లాలో 3 ప్రాథమిక పాఠశాలలు పీఎంశ్రీకి ఎంపిక

రంగారెడ్డి జిల్లాలో కేవలం 3 ప్రాథమిక పాఠశాలలు ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా పథకంకు ఎంపిక కాగా అందులో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి హైదర్షాకోట్‌లోని మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఒకటి.

ఎంపికైన పాఠశాలలో..

స్కూళ్లను పర్యావరణ అనుకూలంగా గ్రీన్ స్కూల్స్‌గా మార్చాల్సి ఉంటుంది. పాఠశాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలి. సోలార్ పానెళ్లను, ఎల్ ఈడీ లైట్స్‌ను ఏర్పాటు చేసుకోవాలి. ప్రయోగశాలలు, క్రీడా సామగ్రి, సిలబస్‌కు అనుగుణంగా డిజిటల్ తరగతి గదులు, టాయిలెట్లు, నీరు, విద్యుత్ సౌకర్యం మొదలైన వసతులలో పాటు పర్యావరణ పరిరక్షణకు సంప్రదాయ విధానాలను విద్యార్థులకు నేర్పించి, మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దాలన్నది ఈ పథకం లక్ష్యం.

సంతోషంగా ఉంది



మా పాఠశాల పీఎంశ్రీకి ఎంపికైనందుకు చాలా సంతోషంగా ఉంది. ఎంపికైనట్లు ప్రొసీడింగ్ రూపంలో శుక్రవారం మాకు తెలిసింది. విద్యార్థులకు వీటిద్వారా నూతన విద్యావిధానంలో నిర్దేశించుకున్న ప్రమాణాలకు అనుగుణంగా విద్యను బలోపేతం చేసి మోడల్ పాఠశాలగా మారుస్తాం. ఇంత గొప్ప అవకాశం మా బడికి రావడం అదృష్టంగా భావిస్తున్నాం.

– శ్రీనివాసరావు, హెచ్‌ఎం

పాఠశాల సర్వతోముఖాభివృద్ధి



విద్యార్థులకు విద్యతో పాటు కావలసిన మౌలిక వసతులు, ఆధునిక హంగులు కల్పించేందుకు దశలవారీగా నిధులు మంజూరు చేస్తారు. విద్యార్థుల ప్రతిభకు మరింత పదును పెట్టేలా చర్యలు చేపడతాం. ఆ నిధులతో పాఠశాల సర్వతోముఖాభివృద్ధికి ఏం కావాలో అన్ని వసతులు కల్పిస్తాం.

–రాంరెడ్డి, ఎంఈఓ, గండిపేట్ మండలం

కుండపోత వర్షం.. జలమయం



పంచవటి కాలనీలో సెల్లార్‌లోకి చేరిన నీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

మణికొండ: మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో శనివారం ఉదయం కుండపోత వర్షం కురిసింది. ఉదయం 5 గంటలకు మొదలయిన వర్షం రెండు గంటల పాటు ఏకధాటిగా కురిసింది. దాంతో లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయమయ్యాయి. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీ, సెక్రటేరియట్ కాలనీ, అంజలి గార్డెన్, మణికొండ గార్డన్‌లలో వరద నీరు పారింది. పంచవటి కాలనీలో రిటర్నింగ్ వాల్ లేని చోట పందెన్‌వాగు ఒక్కసారిగా పొంగటంతో పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌ల సెల్లార్‌లలోకి నీరు చేరింది. అపుడే ఉదయం కావటంతో సెల్లార్‌లోకి నీరు వస్తుండటంతో అందులో ఉన్న వాహనాలను బయటకు తీయటంతో పెద్ద నష్టం జరగలేదు. పంచవటి కాలనీ ప్రదేశంలోని వంతెనపై నుంచి నీరు పారటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మెన్ కె. నరేందర్‌రెడ్డి కాలనీలో పర్యటించి మున్సిపల్ డిజాస్టర్ సిబ్బందితో సహాయక చర్యలు అందించారు. సెల్లార్లలోకి చేరిన నీటిని మోటార్లు ఏర్పాటు చేసి బయటకు తోడేశారు. కొన్ని అపార్ట్‌మెంట్‌లలోని విద్యుత్ మీటర్లు నీట మునగటంతో విద్యుత్ లేకుండానే రోజంతా గడిపారు. భారీ వర్షానికి పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం వరకు సరఫరాను విద్యుత్ అధికారులు, సిబ్బంది పునరుద్ధరించారు.

క్యాన్ నంబర్లు ఇచ్చి బిల్లులు వేయండి



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మణికొండ: జలమండలి నీటి కనెక్షన్‌లలో అత్యధిక శాతం ఇప్పటి వరకు క్యాన్ నంబర్లను కేటాయించకపోవటం, కేటాయించిన వారికి 2021 ఏప్రిల్ నుంచి వేలాది రూపాయల బిల్లులు ఒకేసారి వేయటంతో ప్రజలు చెల్లించలేకపోతున్నారని, ప్రస్తుతం అందరికీ క్యాన్ నంబర్లను కేటాయించి ఏప్రిల్ నుంచి బిల్లులు వేయాలని మణికొండ మున్సిపల్ నాయకులు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, జలమండలి అధికారులను కోరారు. శనివారం మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్‌లు వసంతరావు, పి.శైలజ, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు బి.శ్రీరాములు, ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ కోశాధికారి బాబురావు ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరించారు. గతంలో రెండు సంవత్సరాల బిల్లులు ఒకేసారి వేయటంతో ఎక్కువ మంది చెల్లించ లేదన్నారు. ప్రస్తుతం గతంలో గ్రామపంచాయతీలో నీటి బిల్లులు చెల్లించిన రశీదులు ఉంటేనే క్యాన్ నంబర్లను ఇస్తామని షరతులు పెట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయనకు వివరించారు. ప్రస్తుతం నీటి కనెక్షన్లు ఉన్న వారందరికీ ఎలాంటి షరతులు లేకుండా క్యాన్ నంబర్‌లను జారీ చేయటంతో పాటు ప్రస్తుత నెల నుంచి బిల్లులు వేస్తే ప్రతి ఒక్కరు క్రమం తప్పకుండా చెల్లిస్తారని పేర్కొన్నారు. దాంతో స్పందించిన ఎమ్మెల్యే వెంటనే జలమండలి ఎండీ దానకిషోర్, జీఎం రవీందర్‌రెడ్డిలతో ఫోన్‌లో మాట్లాడి లెటర్ రూపంలో పంపించారు.

ఎల్లమ్మ ఆలయ భూమిలో ఆక్రమణ కూల్చివేత



మణికొండ: ఎల్లమ్మ ఆలయానికి దారి లేకుండా నిర్మించిన ప్రహరీని రెవెన్యూ అధికారులు తొలగించారు. మణికొండ మున్సిపాలిటీ, ల్యాంకోహిల్స్ ముందు ఉన్న ఎల్లమ్మ చెరువు పక్కనే ఉన్న దేవాలయానికి గతంలో రెండు గుంటల భూమిని కేటాయించారు. పక్కనే ప్రైవేటు వ్యక్తులు లేఅవుట్ చేసి ఏకంగా ఆ రెండు గుంటలను కలిపేసుకున్నారు. సదరు ప్లాటును కొనుగోలు చేసిన వారు ప్రహరీ నిర్మాణ పనులను చేపట్టడంతో గురువారం అడ్డుకున్నారు. అయినా శుక్రవారం పనులను కొనసాగించారు. ఈ విషయాన్ని శుక్రవారం పత్రికల్లో కథనాలు రావటంతో స్పందించిన గండిపేట మండల తహసీల్దార్ ఎ. రాజశేఖర్ ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. దాంతో శనివారం ఉదయం అధికారులు, సిబ్బంది ఆక్రమణలను తొలగించడంతో మణికొండ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేవాలయానికి ఉన్న రెండు గుంటల స్థలానికి వెంటనే ప్రహరీ నిర్మించాలని, దేవాలయానికి కమిటీ వేసి అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

లక్ష్మీనగర్‌లో కార్పొరేటర్ పర్యటన



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలో శనివారం అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్ పర్యటించారు. వివిధ శాఖల అధికారులతో కలిసి కాలనీలు, బస్తీలలో తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను అధికారులు చిత్తశుద్ధితో పరిష్కరించాలన్నారు. దోమలు,వీధి దీపాలు సరిగ్గా వెలగడం లేదని వాటికి మరమ్మత్తులు చేయాలన్నారు. పర్యటనలో బీజేపీ నాయకులు సిద్దేశ్వర్, జీహెచ్‌ఎంసీ ఏఈ నర్సింహమూర్తి, ఎస్‌ఎఫ్‌ఏ వినయ్, కాలనీ అధ్యక్షులు మూర్తి స్వామి, ఎంటమాలజీ సిబ్బంది, ఆశావర్కర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటిన ఐఐటీ స్టడీ సెంటర్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఐఐటీ స్టడీ సెంటర్ విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రతిష్టాత్మక నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సీట్లు పొందే అవకాశంతో పాటు జూన్‌లో నిర్వహించే జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు 67 మందికి గాను 66 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు ప్రిన్సిపల్ సురేందర్ తెలిపారు. పి.వంశీ 99.21, లోకేష్ 96.19, ఉపేందర్ 93.42 పర్సెంటేజీతో మొదటి మూడు స్థానాల్లో నిలిచారన్నారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను గురుకులాల సెక్రటరీ రోనాల్డ్ రోస్, అడిషనల్ సెక్రటరీ సర్వేశ్వర్‌రెడ్డి, రీజనల్ కోఆర్డినేటర్ కళ్యాణి, ఓఎస్‌డి రంగారెడ్డి అకడమిక్ కోఆర్డినేటర్ కిశోర్ తదితర గురుకుల ఉన్నతాధికారులు విద్యార్థులను అభినందించారు.

సంస్థల సహకారం అభినందనీయం



కోకాపేట పాఠశాలలో అదనపు తరగతులను ప్రారంభించిన కౌన్సిలర్, సంస్థ ప్రతినిధులు

మణికొండ: ప్రభుత్వ పాఠశాలలకు సంస్థలు తమ వంతు సహకారాన్ని అందించటం అభినందనీయమని నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేట కౌన్సిలర్ జి. శివారెడ్డి అన్నారు. కోకాపేట ప్రభుత్వ పాఠశాలలో ఫ్రాంక్లిన్ టెంప్లెటాన్, రౌండ్ టేబుల్–ఇండియా సంస్థల వారు నూతనంగా నిర్మించిన రెండు అదనపు తరగతి గదులను శనివారం ప్రతినిధులతో కలిసి కౌన్సిలర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలతో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. సంస్థలు కూడా ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు కె. కస్తూరి, గౌరవ్, ఎస్. ఫణీంద్ర, కామరాజు, డి. నాగలక్ష్మి, యు, నిర్మల్, నితీష్ అగర్వాల్, ఇన్‌చార్జి హెచ్‌ఎం కళావతి, మాజీ ప్రధానోపాధ్యాయుడు బల్వంత్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ సాంబశివరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని పార్కులను అభివృద్ధి చేస్తాం



లక్ష్మీనగర్ కాలనీలో పార్కు అభివృద్ధి పనులను ప్రారంభించిన చైర్మన్ నరేందర్‌ముదిరాజ్

మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని పార్కులను తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్ అన్నారు. శనివారం ఆయన 13వ వార్డులో వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్ బి. శ్వేతరవికాంత్‌రెడ్డిలతో కలిసి రూ. 40లక్షలతో చేపట్టనున్న పార్కు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశలవారీగా అన్ని పార్కులను తీర్చిదిద్దుతామన్నారు. పంచవటి కాలనీ, అలకాపూర్ టౌన్‌షిప్‌లోని పార్కులలో పనులు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్, డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయిమౌనిక, కోఆప్షన్ సభ్యులు జె.సిద్దప్ప, జె. లక్ష్మీరాములు, తాజుద్దీన్, నాయకులు బి. ముత్యాలు, బి. రవికాంత్‌రెడ్డి, కిరణ్‌కుమార్, లక్ష్మీనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ముంగి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

దేశ ప్రగతిని దెబ్బతీస్తున్నారు



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగ్‌రావు

రాజేంద్రనగర్: అదానీ, అంబానీ కోసం దేశ ప్రగతిని దెబ్బతీస్తున్న నరేంద్రమోదీని గద్దె దించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాల నర్సింగ్‌రావు అన్నారు. మోడీ హటావో దేశ్‌కి బచావో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని కాలనీలలో సీపీఐ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని దారుణంగా దెబ్బతీశారన్నారు. సరుకుల ధరలు విపరీతంగా పెంచేసి సామాన్యులు బతకలేని పరిస్థితి కల్పించిన నరేంద్రమోదీని గద్దె దించడానికి సీపీఐ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎంఏ రియాజ్, నియోజకవర్గ కోకన్వీనర్ జైపాల్‌రెడ్డి, ఆఫీస్ కార్యదర్శి సత్యనారాయణ, గండిపేట మండల కార్యదర్శి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత ,కనీస వేతనం ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

మణికొండ: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని గండిపేట మండల మెప్మా, సెర్ప్, ఐకేపీ, వీఓఏల నాయకులు శనివారం తహసీల్దార్ జంగయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ డి. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఐకేపీ, వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, రూ. 10లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా కల్పించాలన్నారు. ప్రతినెలా వేతనాలు వీఓఏల వ్యక్తిగత ఖాతాలకు జమ చేయాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు స్వప్న, రేణుక, విజయలక్ష్మి, లక్ష్మీ, విజయ, స్రవంతి, మస్రత్ పాల్గొన్నారు.



మైలార్‌దేవ్‌పల్లిలో మేడే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్మికులు.

మేడే వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

రాజేంద్రనగర్: కార్మికుల హక్కుల రక్షణకై పెట్టుబడుదారీ విధానాన్ని అంతం చేద్దాం అని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో ఏఐటీయూసి రాజేంద్రనగర్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఏ.సాయిలు, టి.ఆనంద్‌ల ఆధ్వర్యంలో శనివారం మేడే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ మేడేను రాజేంద్రనగర్ మండల పరిధిలోని కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్మికులందరికి కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని మున్సిపల్ రంగంలో పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు రాజు, మురళి, సంతోషి, లక్ష్మి, శ్యామలమ్మ, సరస్వతి, కార్మికులు పాల్గొన్నారు.

వాహనాల రాకపోకలు బంద్

లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద భారీగా నిలిచిన వరద నీరు



లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద చేరిన వరద నీటిని తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో శనివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద భారీగా వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సు అండర్ బ్రిడ్జి కింద వరదలో నిలిచిపోయింది. మధ్యాహ్నం బస్సును అక్కడ నుంచి తొలగించారు. మసీద్‌బండ మీదుగా వచ్చే వరద గోపీచెరువు, చాకలి చెరువు మీదుగా రైల్వే అండర్ బ్రిడ్జి కిందికి చేరడంతో భారీగా నీరు నిలిచింది. జీహెచ్‌ఎంసీ ఏఈ సునీల్ సిబ్బంది వరద నీటిని తొలగించేలా చర్యలు తీసుకున్నారు. భెల్ చౌరస్తా నుంచి తారానగర్ మీదుగా వచ్చే వాహనాలను నల్లగండ్ల రైల్ ఓవర్ బ్రిడ్జి మీదుగా మళ్లించడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. వాహనదారులు ఇబ్బందుల పాలయ్యారు. మధ్యాహ్నం 2 గంటల తరువాత రాకపోకలు ప్రారంభమయ్యాయి. స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పర్యటించారు.

ఆలిండ్ ఎంప్లాయిస్ ప్రధాన రోడ్డులో వరద...

శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని ఆలిండ్ ఎంప్లాయిస్ కాలనీ ప్రధాన రోడ్డులో వరద నీరు భారీగా నిలిచిపోయింది. దీంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. ఉదయం 9 గంటలకు వరద నీరు వెళ్ళడంతో రాకపోకలకు మార్గం సుగమం అయింది.



శేరిలింగంపల్లి డివిజన్ ఆలిండ్ కాలనీ ప్రధానరోడ్డులో నిలిచిపోయిన వర్షపు నీరు

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రాజేంద్రనగర్: కార్మికులు తమ పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను పోరాటాల ద్వారానే రక్షించుకోవాలని రంగారెడ్డి జిల్లా భవన నిర్మాణ రంగం జిల్లా అధ్యక్షులు జి.ఎం.కురుమయ్య సూచించారు. వాంబే కాలనీ, లక్ష్మిగూడ భవన నిర్మాణ కార్మిక సంఘం కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ చట్టం ప్రకారం సంక్షేమ బోర్డులో ఉన్న డబ్బులను కార్మికులకు ఖర్చు పెట్టాలన్నారు. నిర్మాణాల నుంచి సెస్ నిధులను సక్రమంగా న్యాయబద్ధంగా వసూలు చేయాలన్నారు. కార్మికులంతా మేడే ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, ఎస్.గాలయ్య, జె.వెంకటేష్, కోశాధికారి స్వామి, గురు, ఆంజనేయులు, కురుమయ్య, మధు, బాబు, పి.దాసు తదితరులు పాల్గొన్నారు.